# ఓపెనింగ్



ఆ రోజు వెనుకబడిన గిరిజనుల ఇళ్ళ కాలనీ ఓపెనింగ్. మరో అరగంటో గంటలోనో ఆ ప్రాంతానికి రవాణా శాఖ మంత్రి రానున్నారు.

ఆ కాలనీ కాంట్రాక్ట్ వ్యవహారమంతా సూపర్‌వైజర్ కనకరాజు వహించాడు.

కనకరాజు ఆ ప్రాంతంలో తెగ హైరానా పడుతూ తిరుగుతున్నాడు. కొంతమంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు అతడినే అనుసరిస్తున్నారు.

కాలనీ నానుకుని రెండు వైపులా చిన్న చిన్న రాళ్ళు పేర్చి వాటి మీద సున్నం పూస్తున్న వారు కొందరైతే, ప్రధాన రోడ్డు నుండి కాలనీలోకి ప్రవేశించే స్థలంలో ఆహ్వాన సూచకంగా బ్యేనర్లు వేలాడదీసి మురిసిపోతున్న వారు కొందరు. మరికొంతమంది దారి పొడవునా పిచ్చి మొక్కలు పీకి, గరికె చెక్కి రహదారిని శుభ్రపరుస్తున్నారు.

అంతా హడావుడి. అందరూ బిజీగానే వారి వారి పనులు చేసుకు పోతున్నారు.

"హలో కనకరాజు..." ఇ.ఇ. పిలుపు విని అటువేపు నడక సాగించాడు కనకరాజు.

"ఏం బాగులేదయ్యా... మంత్రి రాకకు ఇంకా టైమేం పెద్దగా లేదు. ఈలోగా..."

ఇ.ఇ. పూర్తి విషయాన్ని విని - కనకరాజుకి చెమట పట్టేసోయింది.

అప్పటికప్పుడో ఐడియా వచ్చింది కనకరాజుకి.

అంతే-

అతడి కళ్ళు ఆశగా మెరిశాయి. వెంటనే కొంతమందిని ఎక్కడికో పంపి త్వరగా రమ్మని ఆతృతగా చెప్పాడు.

ఓ అరగంట గడిచింది.

రయ్‌మంటూ వచ్చి, కనకరాజు - ఇ.ఇ. ముందు వచ్చి ఆగిందో స్కూటరు.

మంత్రిగారు అక్కడికి దగ్గర్లోగల ఓ చిన్న టౌన్‌లో శంకుస్థాపనలేవో పూర్తి చేసుకుని బయలుదేరిపోయినట్టు వచ్చిన వార్తను స్కూటరు నిలబెడుతూనే చెప్పాడతడు.

అందరిలోనూ టెన్షన్.

ఇంక ఏయే కార్యక్రమాలు ఎలా వున్నాయో మరోసారి పర్యవేక్షించే అవకాశం కూడా ఎవరికీ లేనట్టు పరుగులాంటి నడకలతో రోడ్డు దగ్గరకు చేరుకున్నారు కొందరు.

ముందో కారు వచ్చి ఆగింది.అది పోలీసులది.

మరో కార్లో కలెక్టర్‌గారు, ఇంకో కార్లో మంత్రిగారు, ఒకటి తరువాత ఒకటిగా కార్లన్నీ వచ్చి కాలనీ ముందు ఆగాయి.

కలెక్టరుగారు, మంత్రిగారూ కాలనీ ముందు నిలబడగానే, పురోహితుడు వేద మంత్రాలు ప్రారంభించాడు. చుట్టూ వున్న కెమెరాలు క్లిక్ మంటున్నాయి. కొబ్బరి కాయ కొట్టి, రిబ్బను కట్ చేసి మంత్రిగారు లోపలికి ప్రవేశించారు.

మంత్రిగారు, కలెక్టరుగారు ఓ వేదిక మీద చేసిన ఉపన్యాసాన్ని విలేకర్లు పేపర్ల మీద చకచకా రాసుకుపోతున్నారు.

చప్పట్లు జైజై ధ్వానాలు ప్రారంభించి ముగించారు.

కార్లు స్టార్టయినాయి.

సరిగ్గా అప్పుడే పెద్ద వర్షం ప్రారంభ మైంది. ఆ వర్షానికి దారి పొడవునా పేర్చిన రాళ్ళ మీద సున్నం కరిగిపోయింది. బేనర్ల మీద నీలి మందు వెలిసిపోయింది. కాగితం జెండాలు గాలికి ఎగిరిపోయాయి. పెద్ద పెద్ద చెట్ల ఆకులు రాలి ఆ ప్రదేశం బీభత్సంగా తయారైంది.

ఇవేవీ ఇంక పట్టించు కోనక్కర లేదన్నట్టు ఇ.ఇ. సూపర్‌వైజర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లకేవో సూచన లిచ్చి జీపుల్లో కనుమరుగయ్యారు.

అంతా బ్రహ్మాండంగా జరిగిపోయినట్టు ఆ మర్నాడు పేపర్లలో వార్త లొచ్చేశాయి.

అప్పటికి నెల క్రితం ఆ కాలనీకి కొంచెం దూరంలో మరో కాలనీకి ఓ ప్రముఖుని చేత ప్రారంభోత్సవం జరిపించాడు కనకరాజు. ప్రస్తుత కాలనీఇళ్ళకు తలుపులు లేకపోతే ఆ కాలనీ తలుపులు తెచ్చి అప్పటికప్పుడు ప్రారంభోత్సవం చేయించి బిల్లు పాస్ చేయించుకున్న కనకరాజుకు ఇప్పటి వరకూ ఈ కొత్త కాలనీ ఇళ్ళ తలుపుల సంగతే తలపుకు రాలేదు.

— ఐ.ఎ. నరసింహం

